క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ : విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు చేపడుతున్నందున నల్లగొండ పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏడీఈ శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కోర్టు, కలెక్టర్ బంగ్లా, స్కాట్‌హాల్, ప్రకాశంబజార్, జెడ్పీ ఆఫీస్, రిజిస్ట్రేషన్ ఆఫీస్, మున్సిపాలిటీ, ఆర్టీసీ కాలని, శ్రీనివాసకాలని, బస్టాండ్, రాంనగర్, బీటీఎస్ మహిళా ప్రాంగణం, మిర్యాలగూడ రోడ్డు, శాంతినగర్, హైదర్‌ఖాన్‌గూడ ఏరియాల్లో ఉదయం ఉదయం 6.30 నుంచి 8గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

చొల్లేటి ప్రభాకర్ ప్రచారం

నల్లగొండ టౌన్ : నల్లగొండ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ గురువారం నల్లగొండ పట్టణంలోని పలు కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తన కంప్యూటర్ గుర్తుపై ఓటు వేసి గెలిపిస్తే పట్టణంలోని అన్ని వార్డుల్లో హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేయించడంతోపాటు ఇంటికో ఉద్యోగం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులకు పోటీ పరీక్షల కోసం కేంద్రాలను ఏర్పాటు చేయిస్తానన్నారు.

'మాదిగలు బీజేపీ అభ్యర్థికి ఓటు వేయాలి'

నల్లగొండ టూటౌన్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత చేస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చినందున మాదిగలు అందరూ నల్లగొండ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి మాదగాని శ్రీనివాస్‌గౌడ్‌కు ఓటేసి గెలిపించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు బకరం శ్రీనివాస్ కోరారు. నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అభ్యర్థి మాదగాని శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ మాదిగల కల నెరవేరబోతుందని, వర్గీకరణకు ప్రధాని మోదీ హామీ ఇచ్చారని తెలిపారు. పోతెపాక సాంబయ్య, దాయం విక్రంరెడ్డి, పెరిక మునికుమార్, బొజ్జ దేవయ్య, కమలమ్మ, సుదర్శన్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గొల్ల, కుర్మల ఆర్థిక అభివృద్ధికి కేసీఆర్ కృషి

చండూరు : రాష్ట్రంలో గొల్ల కుర్మలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతగానో తోడ్పాటు అందించారని అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర నాయకుడు గుండబోయిన అయోధ్య యాదవ్ అన్నారు. గురువారం చండూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట ఎరన్న యాదవ్, నల్ల లింగయ్య, ఉడత శంకర్ యాదవ్, మేకల వెంకటేష్ యాదవ్, పెందోట వెంకటయ్య, ఆవుల శంకర్, వెంకన్న ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

మర్రిగూడ : మండలంలోని మేటిచందాపురం గ్రామ పరిధి ఇందుర్తి గ్రామానికి చెందిన మహమ్మద్ ఫరీనాబేగం కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఆమెకు వైద్య ఖర్చుల నిమిత్తం గురువారం రూ.10వేలను బీఆర్‌ఎస్ నాయకుడు చెరుకు లింగంగౌడ్, నామాపురం ఎంపీటీసీ ఊరిపక్క సరితనగేష్ ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో అశోక్‌గౌడ్, మాధవరెడ్డి, దొడ్డి శ్రీను, రఘు, మౌలాలి, నర్సింహ, హజ్జు, అక్రమ్, హుస్సేన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ముదిరాజ్ సంఘం నాయకులు

చిట్యాల: మండలంలోని తాళ్లవెల్లెంల గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం నాయకులు ఆ గ్రామ సర్పంచ్ జనగాం రవీందర్‌గౌడ్, ఎంపీటీసీ వడ్డెపల్లి లక్ష్మయ్య ఆధ్వర్యంలో గురువారం నకిరేకల్ కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షుడు నీలం లింగస్వామి, నీలం పెద్ద మారయ్య, పిచ్చయ్య, వెంకటయ్య, రాములు, వెంకులు, పరమేష్‌తో పాటు మరికొందరు కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు చికిలంమెట్ల సైదులు పాల్గొన్నారు. అనంతరం సుంకెనెపల్లి, గుండ్రాంపల్లి, వెలిమినేడు, బొంగోనిచెర్వు గ్రామాల్లో వేముల వీరేశం ప్రచారాన్ని నిర్వహించారు. చిట్యాల ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, వెలిమినేడు సర్పంచ్ దేశబోయిన మల్లమ్మ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బొంతల అంజిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మినర్సింహ తదితరులు పాల్గొన్నారు.

'బెదిరింపు రాజకీయాలు కాంగ్రెస్‌కు తగదు'

నకిరేకల్: కాంగ్రెస్ నేతలు నకిరేకల్‌లో బెదిరింపు రాజకీయాలకు పాల్పడడం తగదని షీప్ అండ్ గోట్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ అన్నారు. నకిరేకల్‌లో గురువారం బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ గెలిచాక మీ అంతు చూస్తామని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఇటీవల కేతేపల్లి ప్రచారంలో వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. తాజాగా నకిరేకల్‌లోని 17వ వార్డులో అన్నదమ్ముల గొడవలో ప్రతిపక్ష పార్టీ నాయకులు జోక్యం చేసుకున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు యల్లపురెడ్డి సైదిరెడ్డి, రాచకొండ శ్రవణ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డి

నాంపల్లి : తనను మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపిస్తే మునుగోడు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం పాల్వాయి స్రవంతితో కలిసి నాంపల్లి మండలంలోని నర్సింహులగూడెం, జాన్‌తండా, రాందాస్‌తండా, పెద్దాపురం, తిరుమలగిరి, మల్లపురాజుపల్లి, తిరుమలగిరి, తుంగపహాడ్, టీపీ గౌరారం, ఎస్‌లింగోటం, వడ్డపల్లి, చిట్టంపహాడ్, నేవిళ్ళగూడెం, దామెర, నేరళ్ళపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రూ.570 కోట్లతో గ్రామాల్లో సీసీ రోడ్లు వేసి ప్రతి కాలనీని అభివృద్ధి చేశానని తెలిపారు. బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోనికి రాగానే క్రిష్టరాయిన్‌పల్లి, చర్లగూడెం ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు బంధు మండల కన్వీనర్ ఏడుదొడ్ల రవీందర్‌రెడ్డి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రభాకర్ రెడ్డి విజయమే లక్ష్యం

చండూరు : బీఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మరబోయిన వెంకన్న అన్నారు. గురువారం చండూరులో బూత్ ఇన్‌చార్జులు, గ్రామ శాఖ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గుర్రం వెంకటరెడ్డి, ఎత్తపు మధుసూదన్ రావు, బీఎస్ రెడ్డి, పెండ్యాల గీత, నల్ల లింగయ్య, నందికొండ నర్సిరెడ్డి, చొప్పరి వెంకన్న, మాదగోని వెంకటేశం, జక్కల రవీందర్, బొమ్మరబోయిన వెంకటేశం, ఊరుగుండ్ల వెంకటేశ్వర్లు, పాండు, దాసరి స్వామి, తదితరులు పాల్గొన్నారు.


నాంపల్లి : పెద్దాపురంలో మాట్లాడుతున్న కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

కూసుకుంట్ల కుటుంబ సభ్యుల ప్రచారం

మునుగోడు: కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ప్రభాకర్ రెడ్డి సతీమణి అరుణ, కుమార్తె రమ్య, కోడళ్లు స్రవంతి గురువారం మునుగోడు పట్టణంలో ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కర్నాటి స్వామి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బండా పురుషోత్తంరెడ్డి, పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి, ఈద శరత్‌బాబు, ఐతగోని విజయ్, రావిరాల కుమార స్వామి, ఎరసాని దినేష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరిక

మునుగోడు మండలంలోని దుబ్బకాల్వ గ్రామానికి చెందిన పలువురు సీపీఐ నాయకులు గురువారం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. దుబ్బకాల్వ ఉప సర్పంచ్ కొండ వెంకన్న, వార్డు మెంబర్ జహీరా ఫాతిమా, లతీఫ్, దోటి రాధిక, నరేష్ తదితరులు బీఆర్‌ఎస్‌లో ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కర్నాటి స్వామి, సాధు భిక్షం, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్‌లో నేడు కాంగ్రెస్ ప్రజా భరోసా సభ

నకిరేకల్: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వేముల వీరేశం గెలుపును కాంక్షిస్తూ శుక్రవారం ఉదయం 11 గంటలకు నకిరేకల్‌లోని మినీ స్టేడియంలో కాంగ్రెస్ ప్రజా భరోసా సభ జరగనుంది. ఇందుకోసం జరుగుతున్న ఏర్పాట్లను గురువారం వేముల వీరేశం, కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ మెంబర్ చామల శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా వీరేశం మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్లు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నేతలు హాజరవుతున్న ఈ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వారి వెంట నాయకులు నకిరేకంటి ఏసుపాదం, పన్నాల రాఘవరెడ్డి, యాస కరుణాకర్‌రెడ్డి, నాగులంచ వెంకటేశ్వరావు, యాతాకుల అంజయ్య, మంగినపల్లి రాజు, గునగంటి రాజు, గాదగోని కొండయ్య, నకిరేకంటి నరేందర్ ఉన్నారు.

నా రాజీనామాతోనే మునుగోడు అభివృద్ధి చేశారు

నాంపల్లి : తన రాజీనామాతోనే కేసీఆర్ మునుగోడు నియోజకవర్గానికి అధిక నిధులు కేటాయించి అభివృద్ధి చేశారని కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. పున్న కైలాష్‌నేతతో కలిసి నాంపల్లి మండలంలోని ఫకీర్‌పూర్, సుంకిశాల, బండాతిమ్మాపురం, ముష్టిపల్లి, రాజ్యాతండా, దేవత్‌పల్లి, రేఖ్యాతండా, నామానాయక్‌తండా, తిరుమలగిరి, మల్లపురాజుపల్లి, తుంగపహడ్, టీపీ గౌరారం, నాంపల్లి గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, ఎలుగోటి వెంకటేశ్వర్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పానగంటి వెంకన్నగౌడ్, రఘుపతిరెడ్డి సీపీఐ మండల కార్యదర్శి సుదనబోయిన రమేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

గట్టుప్పల్(చండూరు): మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి ఇడం గణేశ్, పద్మశాలి యువజన సంఘం కార్యదర్శి కర్నాటి గణేశ్ తమ అనుచరులతో కలిసి గురువారం రాజగోపాల్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. డీసీసీ ఉపాధ్యక్షుడు దండు యాదగిరి రెడ్డి, మండల అధ్యక్షుడు చెరుపల్లి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ నామని జగన్నాథం, గ్రామ శాఖ అధ్యక్షులు సామల యాదయ్య, భీమగాని మల్లేశం, నామని బుచ్చయ్య పాల్గొన్నారు.

మర్రిగూడ : మండలంలోని కమ్మగూడ సర్పంచ్ మార్నేని నిర్మలలూర్ధయ్య ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కొయ్య ఆరోగ్యయ్య, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో మునుగోడులో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదేవిధంగా తమ్మడపల్లిలో పలు పార్టీల కార్యకర్తలు సర్పంచ్ కొట్టం మాధవిరమేష్ ఆధ్వర్యంలో మునుగోడు ఎన్నికల ఇన్‌చార్జ్ టీకే నీలకంటే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ.నజీర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బేత వెంకటేశ్, మండల కోశాధికారి కొట్టం శ్రీనివాస్, జిల్లా శివ, బేరంగుల సతీష్ పాల్గొన్నారు.

'కోమటిరెడ్డికి బుద్ధి చెప్పాలి'

కనగల్ : నల్లగొండ నియోజకవర్గంలో దళితులను రాజకీయంగా అణగదొక్కుతున్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి అసెంబ్లీ ఎన్నికల్లో దళితులు ఓటుతో బుద్ధి చెప్పాలని మాదిగ యూత్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు దున్న కొండల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట తుర్కపల్లి సర్పంచ్ ఆదిమళ్ల లింగయ్య, ఆదిమళ్ల శంకర్, అద్దంకి రవీందర్, అరెకంటి నర్సింహ, వల్కి వెంకన్న, గోలి నవీన్ తదితరులు ఉన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

చౌటుప్పల్ : సివియర్ డిసబిలిటీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కండరాల క్షీణిత, వెన్నెముక బాధితులకు గురువారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని షాదీఖానాలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కత్తుల బాలకృష్ణ, బికుమాండ్ల సుధీర్, అత్తిని వినయ్‌కుమార్, నవీన్, వినోద్, ప్రణయ్, దీపు తదితరులు ఉన్నారు.

ఓటరు స్లిప్‌ల పంపిణీ

మిర్యాలగూడ టౌన్ : ఈ నెల 30న జరగనున్న ఎన్నికల పోలింగ్‌లో భాగంగా గురువారం మిర్యాలగూడ మున్సిపాలిటీలో పలు వార్డుల్లో బూత్ లెవల్ అధికారులు(బీఎల్‌ఓ)లు ఇంటింటికి వెళ్లి ఓటరు స్లిప్‌లను పంపిణీ చేశారు. మున్సిపాలిటీలో 48 వార్డులుండగా బీఎల్‌ఓలు ప్రతి వార్డులో ముగ్గురు, నలుగురు చొప్పున ప్రతి ఇంటికి వెళ్లి స్లిప్‌లు అందజేస్తున్నారు. ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం గుర్తించి వివిధ రకాల గుర్తింపు కార్డులో ఒకదానితో ఓటరు ఓటరు స్లిప్ తీసుకుని పోలింగ్ కేంద్రానికి వెళ్లాల్సి ఉంటుంది.

రాహుల్ గాంధీ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

మునుగోడు: తెలంగాణ రాష్ట్రంలో 60 శాతానికి పైగా ఉన్న బీసీల కులగణనపై కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ నిర్ణయం తీసుకోవడాన్ని తాము స్వాగతిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన మునుగోడులో విలేకరులతో మాట్లాడారు. వరంగల్ డిక్లరేషన్‌లో బీసీల కుల గణనపై రాహుల్‌గాంధీ నిర్ణయం తీసుకోవడాన్ని హర్షిస్తున్నామని, బీసీ కులగణన జరిగితేనే బీసీలు రాజకీయంగా, ఉద్యోగ, ఆర్థికపరంగా అభివృద్ధి చెందుతారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు తగిన రిజర్వేషన్లు దక్కుతాయన్నారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బీసీ కుల గణన చేసి చిత్తశుద్ధి చాటుకోవాలన్నారు. సమావేశంలో ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బూడిద లింగయ్య యాదవ్, బడేసాబ్, గుంటోజు వెంకటచారి, బొల్లేపల్లి లక్ష్మణ్, బూడిద మల్లికార్జున్ పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీలో అలసత్వం వహించొద్దు

సాక్షి ఎఫెక్ట్..

మునుగోడు : ప్రభుత్వం ప్రతినెలా అందిస్తున్న ఆసరా పెన్షన్ల పంపిణీలో ఎలాంటి అలసత్వం వహించరాదని డీపీఎం మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ ఆర్.భాస్కర్‌గౌడ్ సూచించారు. గురువారం సాక్షిలో ప్రచురితమైన ఆసరా పెన్షన్ల కోసం తప్పని పడిగాపులు అనే కథనానికి అధికారులు స్పందించి మునుగోడు పోస్టాఫీసులో విచారణ జరిపారు. ఈ సందర్భంగా పెన్షన్‌దారులకు రూ.2016 ఇస్తున్నారా, తక్కువ ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. పోస్టాఫీసు సిబ్బంది చిల్లర రూ.16 ఇవ్వడం లేదని కొందరు లబ్ధిదారులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పెన్షన్ డబ్బులు తక్కువగా ఇస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. వేలిముద్రలు రాని పెన్షన్‌దారులకు సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శుల వేలిముద్రలతో సకాలంలో పెన్షన్ పంపిణీ చేయాలని సూచించారు. వారి వెంట సీసీ అంజయ్య, పోస్టాఫీసు సిబ్బంది ఉన్నారు.


పెన్షన్ పంపిణీని పరిశీలిస్తున్న అధికారులు

మందుల సామేల్‌కు ఎమ్మార్పీఎస్ మద్దతు

శాలిగౌరారం : తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మందుల సామేల్‌కు ఎమ్మార్పీఎస్ మద్దతు తెలుపుతోందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ సునిల్ తెలిపారు. శాలిగౌరారం మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2019లో మాదిగల మద్దతుతో గెలిచిన గాదరి కిశోర్‌కుమార్ నియోజక వర్గంలో మాదిగలు రాజకీయంగా ఎదగకుండా అణగదొక్కారన్నారు. మాదిగ నాయకులపై దాడులు చేయించడంతోపాటు అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టిన విషయాన్ని మాదిగలు మరచిపోలేదని అన్నారు. గాదరి కిశోర్‌కు ఈ ఎన్నికల్లో మాదిగలు ఓటుతో తగిన గుణ పాఠం చెప్పాలని కోరారు. పేద కుటుంబానికి చెందిన స్థానికుడైన మందుల సామేల్‌ను గెలిపించే బాధ్యతను ఎమ్మార్పీఎస్ నాయకులు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ ఎర్ర రాములు, పోలెపాక దాస్, సిరుపంగి పరమేశ్, అయిలపాక అనిల్, పరమేశ్, భిక్షం, రమేశ్, సాలు, శ్రీను, బాలస్వామి, ఇజ్రాయెల్, మహేశ్, ప్రవీణ్, రామనర్సు, శ్రీకాంత్ వినోద్ పాల్గొన్నారు.

బీజేపీతోనే సమగ్ర అభివృద్ధి

నకిరేకల్ : బీజేపీతోనే రాష్ట్రంలో సమగ్ర అభివృద్ధి జరుగుతుందని భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. నకిరేకల్‌లోని బీజేపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నకిరేకల్‌లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల పాలన చూశారు. ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి నకిరేంటి మొగిలయ్య, కల్యాణ్ రాజ్, మండల వెంకన్న, మైల నర్సింహ, పల్స శ్రీనుగౌడ్, అంజయ్య, నారగోని వెంకటేశ్వర్లు, కొల్లూరి అంజయ్య, వీరస్వామి పాల్గొన్నారు.

ఆపదలో ఆదుకునే వ్యక్తికి అవకాశం ఇవ్వాలి

మర్రిగూడ : మునుగోడు నియోజకవర్గ ప్రజలను ఆపదలో ఆదుకునే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని భువనగిరి పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్ మన్నె శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. మునుగోడు ఎన్నికల ఇన్‌చార్జ్ టీకే నీలాకంటే, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దం నర్సింహగౌడ్, రాందాసు శ్రీనివాస్, మేతరి యాదయ్య, కొడాల వెంకట్‌రెడ్డి, మాదగోని శ్రీను, జమ్మున వెంకటేష్‌గౌడ్, సిరిపంగి శ్రీనివాస్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కే మాలల మద్దతు

నల్లగొండ : కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకే మాల సంఘాల ఐక్య వేదిక మద్దతు ఇస్తోందని గ్రంథాలయ మాజీ చైర్మన్ రేఖల భద్రాద్రి, మాల మహానాడు మాజీ అధ్యక్షుడు కంచి మధు తెలిపారు. గురువారం నల్లగొండలోని జిల్లా పరిషత్ గెస్టు హౌజ్‌లో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు ఎన్నమల్ల అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. మాల మహానాడు, మాల సంక్షేమ సంఘం, జైభీం సేన, తెలంగాణ మాల మహానాడు, అనుబంధ సంఘాలు ఒకటై కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటిస్తున్నాయన్నారు. తలమల్ల యాదగిరి, రేఖల సైదులు, ఎంపీటీసీల ఫోరం జిల్లా కార్యదర్శి బెజ్జం సాయి, ఎనమల్ల అనిల్‌కుమార్, చింతపల్లి లింగయ్య, భూతం అర్జున్, మాజీ కౌన్సిలర్ అవుట రవీందర్, బూరుగు వెంకటయ్య, ఎన్నమల్ల ప్రభాకర్, బొప్పని నగేష్, రిటైర్డు ఎస్ఐ డేవిడ్ జాన్, గండమల్ల శ్రీను పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రేఖల భద్రాద్రి

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా

- మునుగోడు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి

మునుగోడు: మొదటిసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచిన తనకు ఒక్కసారి అవకాశం ఇచ్చి గెలిపిస్తే ఈ ప్రాంత సమస్యలన్నీ పరిష్కరించి అభివృద్ధి చేసి చూపిస్తానని మునుగోడు నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి అన్నారు. గురువారం మునుగోడు మండలంలోని కిష్టాపురం, ఇప్పర్తి, పలివెల, చీకటిమామిడి, కచలాపురం, కోతులారం తదితర గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అసెంబ్లీలో ఈ ప్రాంత సమస్యలపై మాట్లాడలేదని, ఆయనకు సీఎం కేసీఆర్ వద్దకు వెళ్లి నిధులు అడిగే దమ్ము లేదన్నాడు. కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచిన రాజగోపాల్ రెడ్డి అవకాశవాద రాజకీయాలు చేస్తాడని విమర్శించారు. బీజేపీతోనే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ సీఎం అవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి వేదాంతం గోపీనాథ్, నాగం వర్షిత్ రెడ్డి, సురిగి నర్సింహ గౌడ్, బొడిగే అశోక్ గౌడ్, నందిపాటి రమేష్, పెంబళ్ల జానయ్య, బండారి యాదయ్య, గండు సత్యనారాయణ, కర్నాటి లింగయ్య, జాని, రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.


చీకటిమామిడిలో మాట్లాడుతున్న చలమల్ల కృష్ణారెడ్డి

భూపాల్‌రెడ్డికి మహిళలు బుద్ధి చెప్పాలి

- నల్లగొండ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ: మహిళ పట్ల గౌరవం లేకుండా మాట్లాడిన స్థానిక ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డికి మహిళలు బుద్ధి చెప్పాలని నల్లగొండ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మహిళలకు విజ్ఞప్తి చేశారు. గురువారం నల్లగొండ పట్టణంలోని 12, 26, 27, 28 వార్డుల్లో కోమటిరెడ్డి విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ ఎమ్మెల్యే తన తల్లిని నోటికి వచ్చినట్లు చెప్పుకోలేని భాషలో తిడుతున్నాడని అన్నారు. తాను ఏనాడు ఎవరినీ తిట్టలేదని, ఎలాంటి కేసులు పెట్టలేదన్నారు. తన కుమారుడు ప్రతీక్ పేరున ఫౌండేషన్ ఏర్పాటు చేసి ఎంతోమంది పేద విద్యార్థులను ఉన్నత చదువులు చదివిస్తున్నానని చెప్పారు. నల్ల గొండ పాతబస్తీని న్యూ సిటీగా మారుస్తానని అన్నారు. చేయి గుర్తుకు ఓటేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు షబ్బీర్, సట్టు శంకర్, దుబ్బ మధు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


నల్లగొండ పట్టణంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

కోమటిరెడ్డి అనుచరులను జైలుకు పంపిస్తా

- నల్లగొండ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ : కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముఖ్య అనుచరులు పిల్లి గుట్ట, వక్ఫ్‌భూములు, అసైన్డ్ భూముల్లో చేసిన చిత్రాలన్నింటినీ బయటకు తీసి ఎన్నికల తర్వాత వారిని జైలుకు పంపుతానని నల్లగొండ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు. గురువారం ఆస్ట్రేలియాకు చెందిన ఎన్‌ఆర్‌ఐలు బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలపడానికి నల్లగొండకు వచ్చారు. ఈ సందర్భంగా వారితో కలిసి భూపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కోమటిరెడ్డి వెంట ఉండే ఇద్దరు ప్రధాన అనుచరులు భూ కబ్జాలు చేసి సర్వే నంబర్లు మార్చి రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని ఆరోపించారు. సాక్ష్యాలు తమ వద్ద ఉన్నాయని, ఇప్పుడు బయటకు తీస్తే రాజకీయ కక్ష సాధింపు అని భావిస్తారనే ఉద్దేశంతో బయటకు చెప్పలేదన్నారు. ఆస్ట్రేలియా ఎన్‌ఆర్‌ఐ శాఖ అధ్యక్షుడు కాసర్ల నాగేందర్‌రెడ్డి, కన్వీనర్ సాయిరామ్, వినయ్, సన్నీగౌడ్‌లు మాట్లాడుతూ నల్లగొండలో కనీవిని ఎరుగని అభివృద్ధి జరిగిందన్నారు. ఎమ్మెల్యే నిబద్ధతతో పని చేసినందునే నల్లగొండ రూపురేఖలు మారాయని కొనియాడారు.

కార్యకర్తలు పొత్తు ధర్మాన్ని కాపాడాలి

మునుగోడు : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సీపీఐ రాష్ట్ర కమిటీ.. కాంగ్రెస్ పార్టీతో పెట్టుకున్న పొత్తు ధర్మాన్ని ప్రతి కార్యకర్త కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం కోరారు. గురువారం మునుగోడు మండలంలోని కొరటికల్ గ్రామంలో నిర్వహించిన సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు బీఆర్‌ఎస్ పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో నిలిచిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మతోన్మాద బీజేపీని అంతమొందించేందుకు గత ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్‌తో పొత్తు పెట్టుకున్నామన్నారు. ఈ సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి సురిగి చలపతి, గుర్జ రామచంద్రం, మందుల పాండు, మునుగోటి దయాకర్, దండు లింగస్వామి, మిర్యాల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సత్యం

సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌దే

చండూరు: చేనేత కార్మికులకు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు జెల్లా మార్కండేయ అన్నారు. గురువారం చండూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట కౌన్సిలర్లు కోడి వెంకన్న, గుంటి వెంకటేశం, చిలుకూరు శ్రీనివాస్, కర్నాటి శ్రీనివాసులు, జూలురు శ్రీనివాసులు, కంద గట్ల భిక్షపతి తదితరులు ఉన్నారు.

అడుగడుగునా గుంతలే..


గుంతలమయంగా కురుమర్తి రోడ్డు


సత్యనారాయణపురం గ్రామ శివారులో కంకరతేలి ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

- ప్రమాదకరంగా కురుమర్తి రోడ్డు
- ప్రయాణించేందుకు జంకుతున్న వాహనదారులు

కట్టంగూర్ : మండల కేంద్రం నుంచి కురుమర్తి గ్రామానికి వెళ్లే రోడ్డంతా అడుగడుగునా గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఐదు సంవత్సరాలుగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. కట్టంగూర్ మండల కేంద్రం నుంచి కురుమర్తి గ్రామం సుమారు 8 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. శాలిగౌరారం మండల ప్రజలు, కట్టంగూర్ మండల ప్రజలు కురుమర్తి నుంచి కట్టంగూర్ గ్రామానికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజాప్రతినిధులకు, అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా కనికరించేవారు కరువయ్యారని కట్టంగూర్, శాలిగౌరారం మండలాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. రోడ్డు పొడవునా గుంతలు ఏర్పడడంతో పది నిమిషాలు చేయాల్సిన ప్రయాణం అర్ధగంటకు పైగానే పడుతోంది.

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

కురుమర్తికి చెందిన విద్యార్థులు ఆటోల్లో, సైకిల్‌పై కట్టంగూర్ ఉన్నత పాఠశాలలో ఆంగ్లమాధ్యమంలో విద్యాభ్యాసం చేసేందుకు ఈ దారిగుండా రాకపోకలు నిర్వహిస్తుంటారు. అదేవిధంగా అక్కలాయిగూడెం ప్రజలు నిత్యం ఈ దారిగుండా కట్టంగూర్ మండల కేంద్రానికి పలు పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. శాలిగౌరారం మండలానికి చెందిన ఆకారం, వల్లాల, గురజాల, శాలిగౌరారం ప్రజలతోపాటు కట్టంగూర్ మండలానికి చెందిన గార్లబాయిగూడెం, తేలువారిగూడెం గ్రామాల ప్రజలు నిత్యం ఈ దారిగుండా మండల కేంద్రానికి రాకపోకలు కొనసాగిస్తుంటారు. రోడ్డు బాగాలేకపోవడంతో వందలాది మంది వాహనదారులు నిత్యం పలు పనుల నిమిత్తం కట్టంగూర్‌కు, నల్లగొండకు ఈ రోడ్డు గుండా ప్రయాణించేందుకు జంకుతున్నారు. రోడ్డంతా గుంతలమయంగా ఉండడంతో విద్యార్థులకు, ప్రజలకు తిప్పలు తప్పడం లేదు.

ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా..

రోడ్డుపై గుంతలు ఏర్పడిన ప్రాంతంలో ఎదురెదురుగా రెండు పెద్ద వాహనాలు వచ్చినప్పుడు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. ఆర్టీసీ బస్సులో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు అవస్థలకు గురవుతున్నారు. సత్యనారాయణపురం గ్రామ సమీపంలో మూలమలుపు వద్ద రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. రాత్రిపూట ద్విచక్ర వాహనదారులు ఈ గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. అదేవిధంగా కురుమర్తి గ్రామ శివారులో రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో ఈ రోడ్డు గుండా వెళ్లేందుకు ద్విచక్ర వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు ఆయా గ్రామ ప్రజలు, వాహనదారులు సంబంధిత అధికారులను, ప్రజాప్రతినిధులను కోరినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కురుమర్తి ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి లారీల్లో ధాన్యం తరలించేందుకు లారీ డ్రైవర్లు జంకుతున్నారు. గత సంవత్సరం ఇదే సమయంలో ధాన్యం లోడ్‌తో వెళుతున్న లారీ సత్యనారాయణపురం సమీపంలో టైరు దిగబడడంతో తృటిలో ప్రమాదం తప్పింది. రైతులు ట్రాక్టర్లలో ధాన్యం తరలించాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



కురుమర్తి నుంచి కట్టంగూర్ వరకు రోడ్డుపై అడుగడుగునా గుంతలు ఏర్పడడంతోపాటు కంకర తేలి రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. రోడ్డు ధ్వంసమై ప్రజలు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఈ దారిగుండా ప్రయాణించేందుకు వాహనదారులు జంకుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంప చెట్లను తొలగించి మరమ్మతులు చేపట్టాలి.

– అనంతుల లింగయ్య, కురుమర్తి